రాజాపేట మండలంలో 3 చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పెరిగిన భూగర్భ జలాలు

# కరువు నేలపై జలసిరులు



ఆత్మకూరు (ఎం) : చెరువు కింద సాగు చేసిన వరి

**800 ఎకరాలు సాగులోకి.. సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు**

**ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరింది. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ముందుచూపుతో చేసిన కృషి ఫలించింది. కరువు నేలలో వర్షపు నీటి బొట్టును నిల్వ చేసి భూగర్భ జలాలు పెంచేందుకు మండలంలోని చల్లూరు నుంచి పొట్టిమర్రి మీదుగా రఘునాథపురం వెళ్లే వాగులో మూడు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. దాంతో ఎగువన కురిసిన వర్షాలతో గంధమల్ల చెరువు అలుగు పోస్తుండడంతో మూడేండ్లుగా చెక్‌డ్యామ్‌లు జలకళ సంతరించుకోవడమే కాకుండా చుట్టుపక్కల భూగర్భ జలాలు పెరిగాయి.**

– రాజాపేట, నవంబర్11

## వందల ఎకరాల భూమి సాగులోకి..

గతంలో రాజాపేట మండలంలో పెద్దగా జలవనరులు లేవు. పూర్తిగా బోర్లు, బావుల ఆధారంతో వ్యవసాయం సాగు చేసేవారు. కరువు నేలన నీటి సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టడంతో రైతులకు సాగు నీటి కష్టాలు తీరడమే కాకుండా కరువు నేల కాస్తా కోనసీమగా మారింది. మండలంలోనే అతిపెద్దదైన పొట్టిమర్రి వాగులో మూడు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. వీటి కోసం చల్లూరులో రూ.1.20 కోట్లు, కాల్వపల్లిలో 1.50 కోట్లు, రఘునాథపురంలో రూ.4 కోట్లు వెచ్చించారు. చెక్‌డ్యామ్‌ల కారణంగా భూగర్భజలాలు పెరిగి 8 వందల ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. మూడేండ్లుగా వరుసగా చెక్‌డ్యామ్‌లు నిండి భూగర్భజలాలు పెరుగుతుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాజాపేట : జలకళ సంతరించుకున్న పొట్టిమర్రి వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్

## నిండుకుండలా వీర్ల చెరువు

ఆత్మకూరు(ఎం) : చెరువులను పునర్నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం 8 ఏండ్ల క్రితం మిషన్ కాకతీయ పథకం చేపట్టింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వీర్ల చెరువును రూ.96 లక్షలతో అభివృద్ధి చేశారు. 135 ఎకరాల విస్తీర్ణం, 250 ఎకరాల ఆయకట్టు కలిగి ఉన్న ఈ చెరువులో పూడికను తొలగించారు. దాంతో వర్షపు నీటితోపాటు వరద చేరుతుండడంతో చెరువు జలకళను సంతరించుకుంది. గత మూడేండ్లుగా చెరువు ఎండిపోకుండా నిండుకుండను తలపిస్తున్నది. చుట్టు పక్కల బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగి 2 వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చింది.

## తాగు, సాగు నీటికి ఢోకా లేదు



మూడేండ్లుగా వీర్ల చెరువు నిండా నీళ్లు ఉంటుండడంతో సాగు, తాగునీటికి ఢోకా లేకుండా పోయింది. నాడు నీటి కొరత కారణంగా తక్కువ విస్తీర్ణంలో భూమి సాగు చేయగా, నేడు వీర్ల చెరువు నిండుగా నీరు ఉండడంతో భూగర్భ జలాలు పెరిగి పడావుబడ్డ భూములు సైతం సాగులోకి వచ్చాయి. మిషన్ కాకతీయ పథకం కింద మా ఊరి చెరువును అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–మజ్జిగ రాంబాబు, రైతు, ఆత్మకూరు(ఎం)

## చెక్‌డ్యామ్‌లతో వృథా నీటికి అడ్డుకట్ట



గతంలో వాగులోని నీరంతా వృథాగా పోయేది. ఈ వృథా నీటికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి నిధులు విడుదల చేయించి చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో ఇప్పుడు ఆ వృథా నీటికి చెక్ పడింది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. ఇప్పుడు పుష్కలంగా నీరు ఉండడంతో 10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా.


–తుంగ నగేశ్, రైతు, రఘునాథపురం

# నీరు ఆగింది.. బాట సాగింది

**ఒక్క ఆలోచనతో రెండు సమస్యలు పరిష్కారం**

- రూ.14.50 కోట్లతో సుద్దాలలో చెక్‌డ్యామ్‌తో కూడిన బ్రిడ్జి
- మూడు జిల్లాలను కలిపేలా నిర్మాణం
- చెక్‌డ్యామ్ నిర్మాణంతో పెరిగిన భూగర్భజలాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న సుద్దాల పరిసర ప్రాంతాల ప్రజలు

గుండాల, నవంబర్ 11 : మండలంలోని సుద్దాల గ్రామ సమీపంలో బిక్కేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలన్న సుద్దాల, పరిసర ప్రాంతాల ప్రజల కలను ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి నిజం చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, రైతుల బాధలను అర్థం చేసుకున్న ప్రభుత్వ విప్ రూ.14.50 కోట్లు వెచ్చించి సుద్దాల–పల్లెపహాడ్ గ్రామాల మధ్య బిక్కేరు వాగుపై చెక్‌డ్యామ్‌తో కూడిన బ్రిడ్జిని నిర్మించారు. గత పాలకులు ఎవరూ చేయలేని పనిని పట్టు విడువకుండా ప్రభుత్వ విప్ సునీత చేయడంతోపాటు యాదాద్రిభువనగిరి, నల్లగొండ, జనగాం జిల్లాలను కలిపేలా రాకపోకలు సాగుతుండడంతో ఆయా జిల్లాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడుతగా రూ.4.75 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. బ్రిడ్జితో ప్రయాణ సౌకర్యంతోపాటు రైతులకు కూడా ప్రయోజనం ఉండేలా చెక్‌డ్యామ్‌తో కూడిన బ్రిడ్జి కట్టాలని భావించిన ప్రభుత్వ విప్ రెండో విడుత కింద రూ.9.75 కోట్లు కేటాయించి సుద్దాల, చుట్టుపక్కల గ్రామాల ప్రజల కోరికను నెరవేర్చారు. చెక్‌డ్యామ్‌తో భూగర్భజలాలు గణనీయంగా పెరిగి బోర్లు, బావుల్లో జలాలు ఉబికినట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తునారు. గతంలో బిక్కేరు వాగు ప్రవహిస్తే వాగు అవతలి వైపు వ్యవసాయ భూములు ఉన్న రైతులు పనుల కోసం వెళ్లేందుకు సుద్దాల నుంచి మోత్కూరు మీదుగా ఆత్మకూరు(ఎం)మండలం పారుపల్లి వరకు సుమారుగా 30 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణంతో రైతులు, ప్రయాణికులు సౌకర్యవంతంగా బ్రిడ్జి పైనుంచి వెళ్తున్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని ఎవరూ ఇంతలా అభివృద్ధి చేయలేదని, వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని సుద్దాల గ్రామస్తులు చెబుతున్నారు.



గుండాల–పల్లెపహాడ్ గ్రామాల మధ్య బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌తో కూడిన బ్రిడ్జి

## చిరకాల కోరిక నెరవేరింది



సుద్దాల గ్రామస్తుల ఏండ్ల నాటి కోరికను ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి నెరవేర్చారు. రూ.14.75 కోట్లతో చెక్‌డ్యామ్‌తో కూడిన వంతెన నిర్మించి ప్రజల కష్టాలను తీర్చారు. బ్రిడ్జి నిర్మాణంతో రవాణా సౌకర్యంతోపాటు చెక్‌డ్యామ్ నిర్మాణంతో బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా దొరుకుతుంది. ప్రభుత్వ విప్ సేవలను ఇక్కడి ప్రజలు ఎన్నటికీ మర్చిపోరు.

–గడ్డమీది పాండరి, రైతుబంధు సమితి మండల కన్వీనర్

## ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



సుద్దాల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గత పాలకులకు ఎన్నో సార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. స్వరాష్ట్రంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. ఈ నిర్మాణంతో సుద్దాల, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు, రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

–కాసం నగేశ్, సుద్దాల గ్రామస్తుడు